# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1) **రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత పటిష్ట పరిచేందుకు ప్రతినెలా గణాంకాల సేకరణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు..**

2) **రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

3) **రాబోయే పాతికేళ్లను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ప్రతి ప్రాజెక్ట్‌ను రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.**

4) **గ్యాస్ బుక్ చేసిన 5 రోజుల లోపు డెలివరీ జరిగేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు.**

==========================

రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత పటిష్ట పరిచేందుకు వ్యవస్థలో సామర్థ్య పెంపు జరగాలని, ఇందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. 15 శాతం వృద్ధి సాధించడం ద్వారా స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను చేరుకోగలమని, ఇందుకు వేగంగా గణాంకాలను సేకరించాల్సి ఉంటుందని నిన్న అమరావతి సచివాలయంలో జరిగిన ప్రణాళికా శాఖ సమీక్షలో ఆయన అన్నారు. జీఎస్డీపీ అంచనాలను సంప్రదాయ విధానంలో కాకుండా రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా రూపొందించేలా రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి అంచనాలు మూడు నెలలకు, ఏడాది కాలానికి రూపొందిస్తున్నారని, దీంతో ఆర్థిక స్థితిగతులపై తక్షణ అవగాహన సాధ్యం కావడం లేదని చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్య సాధనలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. మేడ్ ఇన్ ఆంధ్ర -- మేడ్ ఫర్ ఇండియా -- మేడ్ ఫర్ ది వరల్డ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన నిన్న విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సిఐఐ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. గత 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో 800 కీలక ప్రాజెక్టులకు సంబంధించి 23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయని

చెప్పారు.  ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ-----

........వాయిస్ –.. 30 సెకన్లు

---------------------------

పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు.... పొదుపు చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం కుదించాలని భద్రతా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. జిల్లా పర్యటనల్లోనూ వాహన శ్రేణిలోని వాహనాల సంఖ్యను సగానికి కుదించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించారు.

---------------------------

రాబోయే పాతికేళ్లను దృష్టిలో పెట్టుకుని ప్రతి ప్రాజెక్ట్ ను రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్ పోల్స్, రోడ్లు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఎలక్ట్రానిక్ వాహనాలు వంటి అంశాలపై ప్రతి చోట ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన మున్సిపల్ శాఖ అధికారులతో పట్టణ కేంద్రాల ఆధారిత మెగా గ్రోత్ కారిడార్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

---------------------------

పేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ చెప్పారు. క్యాన్సర్‌ను గుర్తిచేందుకు 18 కోట్ల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన అత్యాధునిక పెట్ స్కానింగ్ యంత్రాన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఈరోజు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 ప్రైవేట్ కార్పొరేటు ఆసుపత్రుల్లో ఉన్న పెట్ స్కాన్ సదుపాయాన్ని పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేందుకు గుంటూరు ప్రభుత్వాసు పత్రిలోని నాట్కో కేంద్రంలో ఏర్పాటు చేసామని మంత్రి నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్ బుక్ చేసిన తర్వాత 4 నుంచి 5రోజుల లోపు డెలివరీ జరిగేలా చూడాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నా దెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ఆయన నిన్న గుంటూరు జిల్లా తెనాలిలోని తన కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల పౌర సరఫరాల శాఖాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వంట గ్యాస్ సరఫరా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. ఇందుకు ఈ నెల 16నే తుది గడువుగా నిర్ణయించామని, తర్వాత ఎక్కడా బ్యాక్‌లాగ్స్ ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

తెలంగాణాలో అర్హులైన వయో వృద్ధులు, వితంతువులకు కొత్త ఆసరా పింఛన్లను త్వరలోనే అందచేస్తామని ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా జీళ్ల చెరువులో ఆయన నిన్న ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి స్థానిక ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర సామాజిక పథకాలకు సంబంధించిన అర్జీలను ఆయన తీసుకున్నారు. ప్రజల సమస్యల

పరిష్కారమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

---------------------------

తెనాలిలో అగ్ని ప్రమాదాల నివారణకు మరోక ఫైర్ ఇంజన్ ను ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఆయన నిన్న తెనాలిలో సూర్యశిల్ప శాలలో జరిగిన అగ్ని ప్రమాద స్దలాన్ని పరిశీలించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ..

.. వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష మార్కుల రీ వాల్యుయేషన్, రీ కౌంటింగ్ ఫలితాలను విడుదల చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన మార్కులపై చాలామంది విద్యార్థులు పునః లెక్కింపు, పునఃపరిశీలనకు దరఖాస్తు చేసుకున్నారని..... ఈ ఫలితా లను వెబ్ సైటులో అందుబాటులో ఉంచామని, హాల్ టికెట్, పుట్టిన తేదీ, ట్రాన్సాక్షన్ ఐడీ నంబరు నమోదు చేసి, ఫలితాలను చూసుకోవచ్చని ఆయన సూచించారు.

---------------------------

యువత డిజిటల్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని స్టార్టప్‌లు, ఆవిష్కరణల ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం డిజిటల్ రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

ఈనెల 16వ తేదీ నాటికి దక్షిణ బంగాళాఖాత ప్రాంతం, అండమాన్ నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలపై నైరుతి రుతుపవనాల పురోగమనానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతంపైఏర్పడిన అల్పపీడనం తీవ్రఅల్పపీడనంగా కొనసాగుతోందని వెల్లడించింది. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రా, రాయలసీమలో ఈరోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి వెంకటరావు తెలియచేస్తూ..

వాయిస్ .. 30 సెకన్లు

====================